# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 24 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## లక్ష టన్నుల బాస్మతి రవాణా బంద్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

%పశ్చిమాసియా యుద్ధవాతావరణం నేపథ్యంలో బియ్యం ఎగుమతి దేశాలకు ఇబ్బంది ఏర్పడుతోంది. తాజా పరిణామాలతో భారతదేశపు ప్రత్యేక రకం బాస్మతి బియ్యం ఎగముతులు నిలిచిపొయ్యాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా, ఇరాన్‌కు చేరాల్సిన లక్ష టన్నుల బాస్మతీ బియ్యం మన నౌకాశ్రయాల్లోనే స్తంభించాయని ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీశ్ గోయల్ తెలిపారు.ప్రస్తుత ఘర్షణల దశలో సరుకు రవాణా ప్రమాదకరం అయింది. అందుకే దీనిని ముందుగానే నిలిపివేయాల్సి వచ్చినట్లు ఆలిండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ సోమవారం ఓ ప్రకటనలోఓ తెలిపింది. మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం బాస్మతీ బియ్యంలో ఇరాన్‌కే 18-20% చేరతాయి. సాధారణంగా నౌకల్లో తరలించే సరకుకు బీమా తీసుకుంటారు. అయితే అంతర్జాతీయ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, నౌకల్లో రవాణా చేసే సరకు దెబ్బతింటే, సాధారణ బీమా ప్రయోజనాలు వర్తించవు. అందువల్లే ఇరాన్‌కు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన బాస్మతీ బియ్యాన్ని గుజరాత్‌లోని కాండ్లా, ముంద్రా పోర్టుల్లో ఎగుమతిదారులు నిలిపివేశారు.

## 'స్థానిక' ఎన్నికల ఎందుకు నిర్వహించలేదు

- తెలంగాణ హైకోర్టు
- సర్కారు ఏర్పాట్లు చేస్తే నిర్వహిస్తాం: ఎన్నికల సంఘం
- వాదనలు పూర్తి... తీర్పు వాయిదా
- సర్పంచ్ పదవుల్లో కొనసాగేలా ఉత్తర్వులివ్వాలి : పిటిషనర్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సోమవారం విచారణలో పిటిషనర్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం తమ వాదనలు వినిపించింది. దీనిలో భాగంగా ఎన్ని రోజుల్లో ఎన్నికల నిర్వహిస్తారో చెప్పాలని హైకోర్టు ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామన్న ప్రభుత్వం.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని అడిగింది. దీనికి ప్రభుత్వం సమాధానమిస్తూ.. సమయం కావాలని కోరింది. అయితే ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎన్నికల కమిషన్ కూడా కోర్టుకు విన్నవించింది. ప్రభుత్వం తమ ప్రక్రియ పూర్తి చేస్తే తాము ఎన్నికల నిర్వహణకు ముందుకెళతామని ఈసీ స్పష్టం చేసింది. ఏడాదిన్నరగా ఎన్నికలు జరపకుండా ఏం చేస్తున్నట్టని కోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉంది కదా అని హైకోర్టు ప్రశ్నించింది. పోలింగ్ కేంద్రాలు, భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వ సహకారం అవసరమని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

కాగా, 2024 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి తెలంగాణ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. దాంతో ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని నిబంధనను గుర్తు చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలైనా పెట్టండి.. లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించండి అని పిటిషనర్లు వాదనలు వినిపించారు.

## గోదావరి జలాల్లో ఒక్క చుక్క వదులుకోం

- బనకచర్ల బంక మాకు అంటగట్టే ప్రయత్నం
- బీఆర్ఎస్ హయాంలోనే బనకచర్లకు పునాది
- త్వరలోనే సీఎల్పీ భేటీ
- 201 కి.మీ.. ట్రిబుల్‌ఆర్ నిర్మాణానికి ఆమోదం
- క్రీడా రిజర్వేషన్లు, పారితోషికాలు పెంపు
- 30లోపు కాళేశ్వరం కమిషన్‌కు అన్ని వివరాలు ఇస్తాం
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గోదావరి నదీజలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోబోమని రాష్ట్ర మంత్రివర్గం స్పష్టంచేసింది. ఈ మేరకు జులై మొదటివారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనను వినిపించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఆ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మీడియాకు వివరించారు. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తామన్న ఆయన, కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు పొంగులేటి వివరించారు. వ్యవసాయం దండగ కాదు పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, బనకచర్ల బంకను తమ ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు.

తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేయడాన్ని మంత్రివర్గం ఖండించింది. బనకచర్ల బంకను ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారనీ, ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌కు మంత్రివర్గ ఆమోదం సహా అన్ని వివరాలు అందిస్తామని మంత్రులు చెప్పారు. అలాగే నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ., మేర ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంగళవారం నాటికి రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందనీ, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని మంత్రులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. దానితోపాటే అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

**కేబినెట్ ఆమోదించిన ముఖ్య నిర్ణయాలు:**

డిసెంబరు 9 నాటికి అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ విగ్రహాలు ఏర్పాటు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు చట్టపరమైన, న్యాయపరమైన అన్ని చర్యలు చేపట్టడం.

విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం నిర్వహించడం.

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెల 30లోపు కమిషన్‌కు సమర్పించడం.

తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి కేబినెట్ ఆమోదం.

క్రీడాకారుల కోసం రిజర్వేషన్లు పెంపు, పారితోషికాల అమలు.

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తయారీకి ఆమోదం, డిసెంబరు 9న ఆవిష్కరణ.

సంగారెడ్డి జిల్లాలో రెండు కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయడం.

రైతు భరోసా కింద

## కోటి 49 లక్షల ఎకరాలకు సాయం




- తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు
- రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి
- ఇది ప్రజాప్రభుత్వ ఘనత
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

. రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లోనే కోట్లాది రూపాయల నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేశామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా నిధులు అందించామని, ఎకరానికి రూ.12,000 చొప్పున సాయం అందించినట్లు చెప్పారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కోఆర్డినేటర్ల సమావేశంలో భట్టి ఈ వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకాన్ని ఘనంగా జరుపుకోవాలని, మంగళవారం సాయంత్రం అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు నిర్వహించాలని భట్టి సూచించారు. రైతులు కూడా ఈ సంబరాలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవన ప్రమాణాలు పెంపు రైతు భరోసా నిధులు విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు వంటి అవసరాలకు ఉపయోగపడతాయని, ఇది రైతులను అప్పుల ఊబి నుండి కాపాడి, ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేసేందుకు ప్రోత్సహిస్తుందని భట్టి పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి పెరగడంతోపాటు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.

## భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం, హర్మూజ్ జలమార్గం మూసివేత వంటి కారణాల వల్ల దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ఇరాన్‌పై అమెరికా దాడుల కారణంగా మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు గురయ్యాయి. ప్రారంభంలో భారీ నష్టాలను చూసినప్పటికీ ఆఖరి సమయంలో మార్కెట్లు కోలుకున్నాయి. సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 511 పాయింట్లు తగ్గి 81,897 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 141 పాయింట్లు తగ్గి 24,972 వద్ద స్థిరపడింది. 30 సెన్సెక్స్ స్టాక్స్‌లో 9 పెరిగాయి, 21 పడిపోయాయి. హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టి షేర్లు 2.3% తగ్గాయి. ట్రెంట్, బిఇఎల్ 3.4 శాతం పెరిగాయి. నిఫ్టీలోని 50 స్టాక్‌లలో 35 నష్టాలతో ముగిశాయి. ఎన్ఎస్ఇ ఐటి ఇండెక్స్ 1.48 శాతం, ఆటో 0.92 శాతం, ఎఫ్ఎంసిజి 0.74 శాతం తగ్గాయి. మీడియా 4.39 శాతం పెరిగింది. మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ కూడా లాభాలతో ముగిశాయి.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎస్ స్టేట్‌మెంట్ రికార్డు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా సిట్ అధికారులు కేసులో మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తో పాటు జీఏడీ పొలిటికల్ సెక్రటరీ రఘునందర్ రావు లను విచారణకు పిలిచి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885లోని సెక్షన్ 5(2) ప్రకారం, ఏదైనా ఓ వ్యక్తి ఫోన్ ట్యాప్ చేయాలనుకుంటే పోలీసులు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి లేదా డీజీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. అనంతరం ట్యాపింగ్ చేయాల్సిన ఫోన్ నెంబర్ల జాబితాను ఆయన రివ్యూ కమిటీకి పంపుతారు. ఆ రివ్యూ కమిటీ కేంద్ర టెలికం శాఖ నుంచి అనుమతి తీసుకున్నాకే సదరు ఫోన్లను ట్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే, అసెంబ్లీ సాధారణ ఎన్నికల సమయంలో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని ఎస్ఐబీ బృందం ట్యాపింగ్ కోసం సుమారు 618 ఫోన్ నంబర్లను రివ్యూ కమిటీ ముందు పెట్టగా.. నాటి సీఎస్ శాంతి కుమారి ఆ ఫోన్ నెంబర్ల లిస్ట్‌ను కేంద్ర టెలికం శాఖ కి పంపి అనుమతి తీసుకున్నట్లుగా సిట్ గుర్తించింది. ఇప్పటికే ఈ విషయంలో నాటి రివ్యూ కమిటీ సభ్యులు అప్పటి హోంశాఖ కార్యదర్శి, ప్రస్తుత డీజీపీ జితేందర్, అప్పటి ఇంటెలిజెన్స్ విభాగం చీఫ్ అనిల్ కుమార్‌కు సిట్ అధికారులు కొన్ని ప్రశ్నలతో కూడిన లేఖను పంపి సమాధానాలు రాబట్టారు. తాజాగా మాజీ సీఎస్ శాంతి కుమారితో పాటు నాటి జీఏడీ పొలిటికల్ సెక్రటరీ రఘునందర్ రావులను సిట్ అధికారులు ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

## రైతు భరోసాకు మరో రూ. 513 కోట్లు విడుదల

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


తెలంగాణలో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. దీనికోసం సోమవారం మరో 513.83 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఆదివారం వరకు 9 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల బ్యాంక్ అకౌంట్లలోరైతు భరోసా నిధులను జమ చేసింది. తాజాగా 15 ఎకరాల లోపు ఉన్న రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేస్తోంది . సాగులో ఉన్న ప్రతి గుంటకు రైతుభరోసా నిధులు జమ చేస్తున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రు తెలిపారు. ఇప్పటివరకు 67.01 లక్షల మంది రైతుల ఖాతాలలోకి రూ. 8284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్టు, ఎకరాలతో సంబంధం లేకుండా సాగులో ఉన్న మిగతా భూములకు కూడా రైతుభరోసా నిధుల ప్రక్రియను రేపటి వరకు పూర్తి చేస్తామని మంత్రి అన్నారు.

రేవంతన్న ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే వానాకాలం రైతుభరోసా ప్రక్రియను పూర్తి చేసి, రైతులపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. జూన్ 16 న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చేతుల మీదుగా ప్రారంభించుకున్న రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రెండు ఎకరాల వరకు 2349.83 కోట్లు, రెండో రోజు 3 ఎకరాల వరకు 3901.73 కోట్లు, మూడో రోజు 4 ఎకరాల వరకు 5215.26 కోట్లు, నాలుగో రోజు 5 ఎకరాల వరకు 6404.70 ఎకరాలు, ఐదో రోజు 7 ఎకరాల వరకు 7310.59 కోట్లు, ఆరో రోజు 9 ఎకరాల వరకు 7770.83 కోట్లు, ఏడో రోజు 15 ఎకరాల వరకు 8284.66 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇంత తక్కువ రోజుల్లోనే రైతుభరోసా నిధుల

మిగితా 2వ పేజీలో

## గుజరాత్‌లో బీజేపీకి షాక్

- 4 రాష్ట్రాల్లో 5 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల ఫలితాలు విడుదల
- గుజరాత్‌లో రెండు స్థానాల్లో బీజేపీ ఒక్కటే గెలుపు
- బీజేపీని ఓడించిన ఆప్..
- పంజాబ్ లోని లూథియానా స్థానంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గెలుపు
- కేరళలో కాంగ్రెస్, బెంగాల్‌లో టీఎంసీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గుజరాత్ లో బీజేపీకి షాక్ తగిలింది. విసవాదరా నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి అనూహ్య షాక్ తగిలింది. ఆప్ నిలబెట్టిన మాజీ పోలీసు అధికారి గోపాల్ ఇటాలియా బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్ పై సంచలన విజయం సాధించారు. ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన ఆప్ అభ్యర్థి ఇటాలియా ఏకంగా 17554 ఓట్ల తేడాతో ఘన విజయం అందుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ నుంచి గెలిచిన భూపేంద్ర భయానీ 2023 డిసెంబర్ లో అధికార బీజేపీలో చేరిపోయారు. దీంతో పాటు ఎమ్మెల్యే కూడా రాజీనామా చేయడంతో అప్పటి నుంచీ ఈ సీటు ఖాళీగా ఉంది. ఈ సీటుకు తాజాగా నిర్వహించిన ఉప ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. అధికార బీజేపీ కూడా ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుని కిరీట్ పటేల్ ను రంగంలోకి దించింది. అయితే ఆప్ నిలబెట్టిన మాజీ పోలీసు అధికారి ఇటాలియా గెలుపొందారు.

బోటాడ్ కు చెందిన గోపాల్ ఇటాలియా పోలీసు అధికారిగా కెరీర్ ప్రారంభించి అనంతరం సామాజిక కార్యకర్తగా మారారు. 2017లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మద్యపాన నిషేధం ఉల్లంఘనలపై సీఎం నితిన్ పటేల్ కు ఫిర్యాదు చేసి సంచలనం రేపారు. సీఎంకు ఆయన చేసిన వీడియో కాల్ వైరల్ కావడంతో ఆయన అవినీతి వ్యతిరేక పోరాటానికి బీజాలు పడ్డాయి. రాజకీయాల్లోకి రాక ముందు పటీదార్ రిజర్వేషన్ల పోరాటంలోనూ ఆయన పాల్గొన్నారు. 2020లో ఆప్ లో చేరిన ఇటాలియా రాష్ట్ర ఉపాధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత ఆప్ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. గతంలో పేపర్ లీక్ ఆందోళనలు, రైతుల తరఫున పోరాటాలు చేసిన ఇటాలియాను వారే ఇప్పుడు గెలిపించారు. ఇదే రాష్ట్రంలోని కడి స్థానంలో బీజేపీ అభ్యర్థి రాజేంద్ర చావ్డా 39,452 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.

పంజాబ్‌లోని లూథియానా వెస్ట్‌లో ఆప్ అభ్యర్థి సంజీవ్ అరోరా 10,637 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కేరళలోని నీలంబూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్యధాన్ షౌకత్ 11,000 ఓట్ల ఆధిక్యతతో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం.స్వరాజ్‌పై విజయం సాధించారు. పశ్చిమ బెంగాల్‌లోని కలిగంజ్‌లో టీఎంసీ అభ్యర్థి అలీఫా అహ్మద్ 49,755 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

కాగా, ఈ ఉప ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ గుజరాత్‌లో ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారని, వీరంతా ఇప్పుడు ఆప్ వైపే చూస్తున్నారని అన్నారు.ఈ ఉప ఎన్నికలను సెమీఫైనల్‌గా వర్ణించారు. పంజాబ్, గుజరాత్‌లో 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంజీవ్ అరోడా విజయంతో ఖాళీ అయ్యే రాజ్యసభ సీటు నుంచి ఎవరు పోటీ చేయాలనే విషయాన్ని ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయం తీసుకుం టుందని చెప్పారు.కాగా, గుజరాత్‌లో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ ఓటమి చెందడంతో ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ శక్తిసిన్హా గోహిల్ తన పదవికి రాజీనామా చేశారు.

## పాక్ విమానాలకు గగనతల నిషేధం పొడిగింపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానాలకు మన గగనతల నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ విమానాలకు గగనతల నిషేధాన్ని విధిస్తూ ఏప్రిల్ 30న కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. అనంతరం దీన్ని పొడిగిస్తూ వస్తున్నది. మరోవైపు, పాకిస్థాన్ కూడా భారత విమానాలకు తమ గగగతల నిషేధాన్ని పొడిగించింది. జూలై 24 వరకు నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో పాక్ ఏప్రిల్ 24న గగనతల నిషేధాన్ని విధించింది



## ముగ్గురు ఎమ్మెల్యేల బహిష్కరణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) కీలక నిర్ణయం తీసుకున్నది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఈ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు బీజేపీతో వారికి సంబంధాలున్నట్లు ఆరోపించింది. గోసాయిగంజ్ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ పాండేను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎక్స్‌లో పేర్కొంది. కాగా, ఈ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, మతపరంగా విభజన సృష్టించే ప్రతికూల భావజాల పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఆరోపించింది. తమ రాజకీయ వైఖరిని పునఃపరిశీలించేందుకు ఇచ్చిన సమయం ముగిసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్టీతోపాటు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. బహిష్కరించిన ఎమ్మెల్యేలు 2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఓటు వేశారని ఎస్పీ ఆరోపించింది.

## ఆదివాసీలపై దాడి అమానుషం..

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



'పేదలన్న ప్రేమలేదు.. ఆడబిడ్డలన్న ఇంగితంలేదు.. అందుకే రేవంత్ సర్కారు పోడు భూములు సాగు చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీ బిడ్డలపై దాడులకు దిగింది. ఆడబిడ్డలను వివస్త్రలను చేసి కొట్టించింది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్ మీదికే కాదు.. అడవులపైకీ బుల్డోజర్లు పంపడం సిగ్గుచేటని సోమవారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 420 హామీలు అమలు చేయ డం చేతగాక, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట రాష్ట్ర రాజధానిలో పేదల ఇండ్లు కూల్చడమే పనిగా పెట్టుకున్నదని దెప్పిపొడిచారు. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూ సేకరణ పేరిట లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాలు, ఇండ్లమీదికి బుల్డోజర్లను పంపి పైశాచికానందం పొందుతున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేస్తూ దుర్మార్గాలకు ఒడిగడుతున్నదని విమర్శించారు. 420 హామీలను పక్కకు పెట్టి కూల్చే, కాల్చే పథకాలను ముందుకు తెచ్చిందని ఎద్దేవాచేశారు.

హైదరాబాద్‌లో రూ.430 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వేస్టేషన్, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ పైకప్పులే బీజేపీ ఇంజినీరింగ్ అద్భుతాలకు నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీ మార్క్ అభివృద్ధిని బహిర్గతం చేసేందుకు ఒక్క సాధారణ వర్షం చాలని దెప్పిపొడిచారు. నిరుడు ఢిల్లీలో కూలిపోయిన ఎయిర్‌పోర్ట్ స్లాబ్, ఇటీవల వర్షానికి అతలాకుతలమైన చర్లపల్లి రైల్వేస్టేషన్ ఫొటోలను పోస్ట్‌కు జతచేశారు. వాళ్లు నిర్మించిన పైకప్పుల గొప్పతనం గురించి చెప్పుకొనేందుకు సిగ్గుపడుతున్న బీజేపీ నాయకులు.. కాళేశ్వరంపై ఇష్టారీతిన మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. అయినా బీజేపీ తెచ్చిన షేప్ షిఫ్టర్ పైకప్పుల అద్భుతమైన కొత్త మోడల్‌ను ఏ ఏజెన్సీ పరిశీలిస్తుందోనని తాను ఆశ్చర్యపోతున్నానని పేర్కొన్నారు.

## 3 నెలల నుంచి సఫాయి కార్మికులకు జీతాలు అందట్లేదు

- మాజీ మంత్రి హరీష్ రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ట్రాక్టర్ల లో డిజిల్ పోయలేకనే గ్రామాల్లో చెత్త సేకరించట్లేదని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. .ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని, సఫాయి కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంట్రాక్టర్లు 10 నుంచి 20 శాతం కమీషన్ ఇస్తే బిల్లులు చెల్లిస్తున్నారని చెప్పారు.సఫాయి కార్మికులు కమీషన్ ఇవ్వలేరు కాబట్టి జీతాలు ఇవ్వట్లేదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకే సిఎం రేవంత్ రెడ్డి కు సమయం సరిపోతుందని చురకలంటించారు. నెలకోసారి కూడా సిఎం సచివాలయానికి వెళ్లట్లేదని హరీష్ రావు దుయ్యబట్టారు.

# ‘పొద్దుతిరుగుడు తూకంలో తరుగు పేరుతో కటింగ్..’



**● జిల్లా కలెక్టరేట్‌లో రైతుల నిరసన**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలో కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట తూకంలో తరుగుతో కటింగ్ చేయడం ఏమిటని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి, పత్తికుంటపల్లె, కేశన్నపల్లె, ముస్కానీపేట, గాలిపల్లి రైతులు బైటాయించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఆదేశాల మేరకు డి ఆర్ డి ఓ విచారణ చేపడుతామని, ఇప్పటి వరకు ఎలాంటి రిపోర్టు ఇవ్వకపోవడంపై అధికారుల తీరుపై మండిపడుతు బైటాయించిన రైతులు .సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని భీష్మించి కూర్చున్న రైతులు. కలెక్టర్ ని మరోసారి కలిసి తమ బాధలు చెప్పుకుంటామని రైతులు వేచి చూశారు.

## ఆకునూరి దేవయ్యకు
# సుద్దాల బాలయ్య మెమోరియల్ అవార్డు..



**బలగం టీవీ, కరీంనగర్**

సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ మ్యూజిక్ డే (ప్రపంచ సంగీత దినోత్సవం) సందర్భంగా ప్రముఖ జానపద కళాకారుడు సుద్దాల బాలయ్య గారి మెమోరియల్ అవార్డును రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆకునూరి దేవయ్యకు ప్రదానం చేశారు.కరీంనగర్‌లోని కళాభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేతులమీదుగా ఆకునూరి దేవయ్య ఈ అవార్డును అందుకున్నారు.

# వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు..

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ పట్టణం,రాజన్న ఆలయాన్ని రెండు కండ్లుగా అభివృద్ధి చేస్తామని, ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.ఆదివారం వేములవాడ పట్టణంలోని 3వార్డు లక్ష్మీపురం ,17 వార్డు శాస్త్రినగర్,18 వార్డు గాంధీ నగర్ లో 32 లక్షలతో సైడ్ డ్రైన్, సీసీ రోడ్లు మరియు సీసీ కల్వర్టుల నిర్మాణనికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే పరమావధిగా ముందుకు పోతున్నామని తెలిపారు..

**సొంత ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు**

వేములవాడ పట్టణంలోని లక్ష్మీపురం పెద్దమ్మ కాలనీలో పలు ఇండ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. కాలనీలోని పలు ఇండ్లను



పరిశీలించి స్వంత ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు

**అధైర్య పడవద్దు అండగా ఉంటా..**

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగి మాజీ సర్పంచ్ గొర్రె రాజవ్వ మైసయ్య ఇల్లు దగ్ధం కాగా,విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దగ్ధం అయిన ఇల్లును పరిశీలించారు..ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు..సెస్ అధికారులతో, కలెక్టర్ తో మాట్లాడి తక్షణ సహాయం కింద పరిహారం అందజేయాల్సిందిగా సూచించారు .నిత్యావసర వస్తువులు బాధిత కుటుంబానికి అందజేశారు.. వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు..ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

**రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేశాం..**

**బలగం టీవీ, కరీంనగర్:**

రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తొలి ఏడాది రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 62 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. ఎరువుల కొరత ఎక్కడా లేదని, ప్రతి మండలం వద్ద అవసరమైన స్టాక్ అందుబాటులో ఉంచుతున్నామని ఆయన పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశామని, రైతు భరోసా నిధులు కూడా రైతుల ఖాతాలలో జమ అవుతున్నాయని వెల్లడించారు.

వేములవాడ నియోజకవర్గంలోని సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణం, భూసేకరణ కోసం, అలాగే శ్రీపాద నారాయణపురం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ చేసేందుకు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**బలగం టీవీ, బోయినిపల్లి**

బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో,మండల అధ్యక్షులు పరశురాం నాయకత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ( పుణ్యతిని ) జయంతి వేడుకలు పురస్కరించుకొని మండలంలోని గ్రామాల వారీగా బూత్ అధ్యక్షులు మొక్కలు నాటి వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్, బోయినిపల్లి మండల ఇన్చార్జ్ దుబ్బాల శ్రీనివాస్ విచ్చేసి మండల కేంద్రంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగినది.

ముఖ్య అథితి దుబ్బాల శ్రీనివాస్ మాట్లాడుతూ: ఆర్టికల్ 370 మరియు 35ఎ రద్దు చేయడం ద్వారా భారత రాజ్యాంగ వ్యవస్థలో పూర్తిగా భాగమైన జమ్ము కాశ్మీర్.సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదమే పునాదిగా, భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా భారతీయ జన సంఘ్ ను స్థాపించిన మార్గదర్శి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని,అఖండ భారతమే ఆదర్శంగా దేశ ప్రజల సంఘటితమే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి అని కొనియాడారు.అదేవిధంగా “ ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహి చలేగా” అని నినదించిన ధైర్యశాలి చాలా మంది యువకులకు స్ఫూర్తి ఇచ్చిన మహనీయుడు శ్యాం ప్రసాద్అని తెలిపారు.పటిష్ట జాతీయ భావజాల నిర్మాణమే పరమావధిగా తన జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్య చైతన్యశీలి అని కొనియడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉదారి నరసింహచారి, బొంగొని అశోక్ గౌడ్, కొనుకటి హరీష్, స్వామి కుమార్, కిరణ్,వినొద్, బూత్ అధ్యక్షులు గంగాధర్ చారి,గడ్డమీది నరేష్,రాజేంద్రప్రసాద్,కళ్యాణ అనిల్, చంద్రయ్య, బాల్ రెడ్డి,ఇల్లందుల పరుశు రాములు,జనగం లక్ష్మణ్, ఇల్లందుల బాలయ్య,రేగుల రమేష్, గొట్ల ఐలయ్య, రాచర్ల రాజేశం, రంజిత్,నవీన్,సారంపల్లి రాజు,తిరుపతి,బ్రహ్మ ప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షాల కోసం రైతుల కప్పతల్లి ఆట..

**బలగం టీవీ, బోయినిపల్లి**

వర్షాలు కురిసి పంటలు బాగా పండాలనే ఆశయంతో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని రైతులు ఆదివారం రోజున వరుణ దేవుణ్ణి భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. సంప్రదాయ విశ్వాసాలను పాటిస్తూ, కప్పతల్లి ఆటను ఆడారు. బోరు బావులు ఎండిపోవడం, పొలాలు వరుసగా ఎండ వేడిమిలో ముదిరిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు కురవాలన్న ఆకాంక్షతో, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు కలసి కప్పతల్లి ఆటను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.రైతుల ఆకాంక్షకు ప్రకృతి అనుకూలంగా ఉండాలని, త్వరలోనే వర్షాలు కురిసి రైతుల శ్రమ ఫలించాలన్నది అందరి ఆకాంక్ష.

**వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు ఆడిన కొండన్నపల్లి గ్రామస్తులు..**

**బలగం టీవీ, గంగాధర**



వరుణ దేవుడి ఆకాంక్ష కోసం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామంలో కప్పతల్లి ఆటలు కొండన్నపల్లి గ్రామస్తులు, బాలులు ఆడారు. దేవుని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. వర్షాలు కురువాలన్న ఆకాంక్షతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చిన్నారులు మహిళలు కలిసి కప్పతల్లి ఆటను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి,వర్షాలు కురవాలని ప్రత్యేక పూజ నిర్వహించారు.

# బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు..



**బలగం టీవీ, గంగాధర**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రీ మరియు హిమ్మత్ నగర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీ నాయకులు ఆదివారం రోజున కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. చేరిన వారిలో గుంటుకు మల్లేశం వార్డు మెంబర్, చెలివెల రాజు, గుంటూకు పోచయ్య, గరికంటి మల్లయ్య, గుంటుకు మల్లేశం, కొత్త కొండ అనిల్, అజయ్, ఎండి అక్బర్, చలిమల శివరాం, సిద్ధం రాజు, గణేష్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వైద రామానుజం, చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, గంగాధర మండల బిజెపి శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్, దళిత మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి సర్వ శ్రీనివాస్, మండల బిజెపి నాయకులు గుంటుకు రవీందర్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు ప్రజావాణికి మొత్తం 261 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో



సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

**-మహిళల ఆత్మగౌరవంతో కట్టుకునేలా నాణ్యమైన చీరలు సరఫరా**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కలెక్టర్ నుంచి చేనేత జౌళి శాఖ మంత్రి, ముఖ్యమంత్రి వరకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పెండింగ్ బకాయిలను కూడా తమ ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చెల్లించడం జరిగిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ఇందిరానగర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి చీరల నాణ్యతను,ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేతన్నల, రైతన్నల సంక్షేమం ఎజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయలను వానాకాలం పంట పెట్టుబడి క్రింద రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ రంగంలో తయారయిన ప్రతి బట్ట ఆర్డర్ చేనేత కార్మికులకు అందిస్తున్నామని, డబ్బుకు వెనకాడకుండా కమిటి వేసి మహిళలకు మెరుగైన చీరలు అందించేలా ప్రభుత్వం నిర్ణయించి, ఆర్డర్ ను ప్రభుత్వం చేనేత కార్మికులకు అందించిందని అన్నారు . రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు సిరిసిల్లలో తయారుచేసిన ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం గర్వకారణమని అన్నారు. చేనేత కార్మికులకు, ఆసాములకు చేతి నిండా పని కల్పించడంలో ప్రభుత్వానికి ఆత్మ సంతృప్తి ఉందని అన్నారు.చేనేతలకు ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని, నూలు సబ్సిడీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. మహిళల ఆత్మగౌరవం పెంచేలా మంచి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.

4 కోట్ల 30 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తి లక్ష్యం ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని అన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. విద్యుత్ బకాయిల సమస్య కూడా పరిష్కరిం చుకున్నామని అన్నారు. నేత కార్మికులను, పవర్ లూమ్ రంగానికి కాపాడే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రజల దశాబ్దాల కల నూలు డిపో ఏర్పాటు చేశామని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ధార్మిక కార్మిక క్షేత్రంగా నిలిచిపోతుందని అన్నారు. వేములవాడ ఆల య అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో ఇప్పటి వరకు 150 కోట్ల రూపాయలను వేములవాడ ఆలయ అభి వృద్ధికి ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. 47 కోట్ల 98 లక్షల రూపాయల కలెక్టర్ ఖాతాలో జమ చేసే అభివృద్ధి పనులు వేగవంతం చేశామని అన్నారు. ఆలయ అభివృద్ధికి రాజన్న అనుమతి లభించిందని, 76 కోట్లతో ఆలయం 4 ఎకరాలకు విస్తరణ పనులు టెండర్లు పిలిచామని అన్నారు. పద్మశాలి భవన్ కు ప్రభుత్వం 5 కోట్ల, 3 కోట్ల రూపాయల సంఘాల నుంచి సేకరించి నిర్మించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన చీరల ఆర్డర్ ను సకాలంలో పూర్తి చేసి అందించాలనిఅన్నారు. జూన్ నెలాఖరు నాటికి సగం ఆర్డర్ డెలివరీ పూర్తి చేయాలని, చేనేత కార్మికులకు అవసరమైన నూలు వేములవాడ డిపో నుంచి తరపున అవుతుందని, కార్మికులు అందించిన చేనేత చీరలను ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేస్తుందని, చీరల ఆర్డర్ తర పున పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వం సంబం ధిత నిధులను విడుదల చేస్తుందని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించిన చీరల ఆర్డర్ ను చేనేత కార్మికులంతా విజయవం తంగా పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్ రావు, ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి,యువత

# యాంటీ డ్రగ్ సోల్జర్ మారాలి

**-డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలిద్దాం**

**-భావితరాలకు మంచి భవిష్యత్తుని అందిద్దాం..**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, సిరిసిల్ల**




డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని,ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ మారాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం – అక్రమ రవాణా అవగహన వారోత్సవాల సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల నిర్మూలనపై 2కే రన్ నిర్వహించారు. కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ 2 కే వరకు నిర్వహించినారు.అనంతరం ర్యాలీ కి వచ్చిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ డ్రగ్స్ నిర్ములనకోసం జరుగు తున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని అన్నారు. యువత గంజాయి లాంటి మత్తుపదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని,చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు వైపు నడుచుకోవాలని అన్నారు.ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాధకద్రవ్యాల వలన కలుగు అనర్ధాలపై అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలు సమూలంగా నిర్మూలించటలో యువత,ప్రజలు పోలీసు వారికి సహకరించుటలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా అవగహన వారోత్సవాలలో భాగంగా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మాధకద్రవ్యాల వలన కలుగు అనర్ధాలపై పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబందించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111 కి లేదా డయల్100 లేదా మీ పరిధిలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగు తుదన్నారు. ఈకార్యక్రమంలో సి.ఐ లు మొగిలి, నాగేశ్వరరావు, నటేష్,మధుకర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ రవి,ఆర్ఐ లు మధుకర్, రమేష్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, రామ్మోహన్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆర్ఎస్.ఐ రాజు, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..



**- ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదుల ను ఎస్పీ మహేష్. బి.గితే స్వీకరించి నారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.



# ఆర్ఐపై చర్యలు తీసుకోండి

**బలగం టీవీ, గంభీరావుపేట**


ప్రజలు, విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్న ఆర్ ఐ గోపికృష్ణ పై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్ ఐ గోపికృష్ణ పై కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంట అశోక్ మాట్లాడుతూ గంభీరావుపేట మండలం తాసిల్దార్ కార్యాలయములో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ పి. గోపిక్రిష్ణ తాసిల్దార్ కార్యాలయముకు వివిధ పనులపై వచ్చే ప్రజలు,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న పేపర్లను బయటకు విసిరివేస్తూ ,భయభ్రాం తులకు గురిచేస్తూ నా నా బూతులు తిడుతూ స్థానిక పోలీస్ స్టేషన్లో మీపై పిర్యాదు చేస్తానని బెదరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తు న్నాడని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను మరియు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆర్ఐ.పి. గోపిక్రిష్ణ పై విచారణ చేపట్టి చర్యలు తీసుకొని,అతని స్థానములో వేరేవారిని నియమించాలని డిమాండ్ చేశారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ తరగతికి లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

2025–26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో ప్రవేశాల కోసం విద్యార్థుల ఎంపికను సోమవారం లాటరీ పద్ధతిలో నిర్వహించారు.

జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ అవకాశానికి మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 33% బాలికలకు రిజర్వేషన్ ప్రకారం 19 సీట్లు, జనరల్ కేటగిరీలో 27 సీట్లు కలిపి మొత్తం 46 సీట్లు లాటరీ ద్వారా భర్తీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి బి. రాజామనోహర్ రావు, జిల్లా విద్యాధికారి ఎస్. వినోద్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ జాస్మిన్ థెరిస్సా, ప్రిన్సిపల్ / గురుకుల పాఠశాల / జూనియర్ కాలేజ్ చిన్నబోనాల సిరిసిల్ల ఎం. విజయలక్ష్మి, సహాయక ఎస్సీ సంక్షేమ అధికారి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో సుస్థిరంగా లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయించడం జరిగింది.



తెలంగాణ ప్రభుత్వం
షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ

పత్రికా ప్రకటన

ఆర్.సి.నం. A3/68/2024 తేది:23-06-2025

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు 1వ తరగతి నందు ప్రవేశమునకు తేది:23-06-2025 (సోమవారం) రోజున లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక.

2025 -26 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకము ద్వారా 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్ ) ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ నందు ప్రవేశమునకు రాజన్న సిరిసిల్ల జిల్లా లో 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) నందు దరఖాస్తులు పూర్తి స్థాయిలో మొత్తం (114) రాగా అందులో 1వ తరగతికి 33% బాలికల రిసర్వేషన్ ప్రకారంగా (19) సీట్లు మరియు జనరల్ కేటగిరి నందు (27) సీట్లు మొత్తం (46) సీట్లను లాటరీ పద్ధతి ద్వారా తేది:23 -06-2025 (సోమవారం ) రోజున ఉదయం 9 .00 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియమ్ రాజన్న సిరిసిల్ల నందు శ్రీ సందీప్ కుమార్ ఝా, కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, రాజన్న సిరిసిల్ల గారి ఆధ్వర్యములో శ్రీ బి. రాజామనోహర్ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, రాజన్న సిరిసిల్ల గారు, శ్రీ S. వినోద్ కుమార్, జిల్లా విద్యాధికారి, రాజన్న సిరిసిల్ల గారు, శ్రీమతి జాస్మిన్ థెరిస్సా, జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ /గురుకుల పాఠశాల /Jr.కాలేజ్ చిన్నబోనాల, సిరిసిల్ల గారు, మరియు శ్రీమతి ఎం.విజయ లక్ష్మి, సహాయక SC సంక్షేమ అధికారి సిరిసిల్ల గారు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షములో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరిగినది.

ఇట్టి కార్యక్రమములో కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ రాజన్న సిరిసిల్ల గారు, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, రాజన్న సిరిసిల్ల, జిల్లా విద్యాధికారి, రాజన్న సిరిసిల్ల, జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ /గురుకుల పాఠశాల /Jr.కాలేజ్ చిన్నబోనాల, సిరిసిల్ల, సహాయక SC సంక్షేమ అధికారి సిరిసిల్ల, కార్యాలయ సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రుల పాల్గొన్నారు.

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి,
రాజన్న సిరిసిల్ల.

టు:
జిల్లా పౌర సంబంధాల అధికారి , రాజన్న సిరిసిల్ల జిల్లా గారు ఇట్టి ప్రకటనను జిల్లాలోని అన్ని దినపత్రికలలో ప్రచురణ చేయుట నిమిత్తం పంపనైనది.

# నాలుగు వరుసల రహదారిని నిర్మించండి.

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని నంది కమాన్ నుండి ఆరేపల్లి బ్రిడ్జి వరకు ప్రతిరోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా 4 వరుసల రహదారిని నిర్మించాలని మరియు డివైడర్లను నిర్మించాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ పక్షాన, వేములవాడ అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ వినతి పత్రం అందజేశారు.



## సీషెల్స్ నేషనల్ డే బాక్సింగ్ డే టోర్నీ.. భారత్‌కు ఏడు పతకాలు..

**బలగం టీవీ, హైదరాబాద్**

సీషెల్స్ నేషనల్ డే బాక్సింగ్ డే టోర్నీలో భారత బాక్సర్లు దుమ్మురేపారు. టోర్నీలో మూడు స్వర్ణాలు సహా మూడు రజతాలు, కాంస్యంతో అగ్రస్థానంలో నిలిచారు. సోమవారం జరిగిన వేర్వేరు బౌట్లలో హిమాంశు శర్మ(50కి) ప్రత్యర్థిపై వాకోవర్‌తో పసిడి గెలుచుకోగా, అశిష్(55కి) 4-1 తేడాతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. 90ంకిలోల విభాగంలో గౌరవ్ చౌహాన్ 3-2తో పసిడి ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ఫైనల్లో ప్రత్యర్థుల చేతిలో ఓటములతో అన్మోల్(60కి), ఆదిత్యాయాదవ్(65కి), నీరజ్(75కి) రజతాలకు పరిమితమయ్యారు. పురుషుల 70కిలోల విభాగంలో కార్తీక్ దలాల్‌కు కాంస్యం దక్కింది.

# రైతు భరోసాకు మరో రూ. 513 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)


జమ ప్రక్రియను పూర్తి చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారి అని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్న కూడా రైతు సంక్షేమంలో ఎలాంటి రాజీ పడకుండా వానాకాలం రైతుభరోసా పథకాన్ని పూర్తిచేసిన రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆనందంలో మునిగిపోయారని, ఇంతకు ముందు 2 నుండి 4 నెలల సమయం పట్టేదని, కాని రేవంత్ ప్రభుత్వం కేవలం 9 రోజులలోనే పూర్తి చేసిందని రైతులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంతకుముందు రైతు రుణమాఫి కూడా చెప్పినట్టుగానే ఆగస్టు 15 లోగా పూర్తి చేశామని ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తుచేశారు. అంతేకాకుండా దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయనివిధంగా సన్నలకు మద్ధతు ధరపై 500 బోనస్ ప్రకటించడం జరిగిందని, తద్వారా అదనంగా 2 వేల కోట్లకు పైగా రైతులు లబ్ధి పొందారన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్న, కొనకపోయినా%ో% మార్క్ ఫెడ్ ద్వారా పండిన ప్రతి పంటను తమ ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యం అని, ఇందిరమ్మ రాజ్యం అంటేనే రైతుల రాజ్యమని మరోసారి మా ప్రభుత్వం రుజువు చేసిందని మంత్రిగారు అన్నారు. రైతు భరోసా ద్వారా అందుకున్న నిధులను రైతులు పంట పెట్టుబడులకు వాడుకొని, మంచి పంటలు పండించుకోవాలని ఈ సందర్భంగా మంత్రిగారు ఆకాంక్షించారు .

ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, కానీ ఇవేమి కనబడని ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా మా ప్రభుత్వం రైతులకు చేస్తున్న మంచిని గ్రహించి ధురుద్ధేశంతో చేసే విమర్శలు మానుకోవాలని, రైతులకు మేలు చేసే ఆలోచనలతో ముందుకురావాలని హితవు పలికారు. రైతుల సంక్షేమమే మాకు తొలి ప్రాధాన్యమని, అందుకనుగుణంగానే గౌరవ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మేమందరం కలిసి పనిచేస్తున్నామన్నారు. రైతుల సంక్షేమం పట్ల మా ప్రభుత్వ వైఖరి చిత్తశుద్ధి ఏ మాత్రం మారదని మంత్రిగారు తెలియజేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతుభరోసా నిధులను ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే పూర్తి చేసిన సందర్భంగా, సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతుపండగ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటలకు రైతులను ఉద్ధేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతారని మంత్రిరు తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజతపూర్వకంగా ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి వారి వారి నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో పెద్దఎత్తున పాల్గొని ఈ రైతుపండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాగా, ఇప్పటి వరకు మొత్తం 67.01 లక్షల మంది రైతుల ఖాతాలలోకి రూ.8284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్లు మంత్రి తుమ్మల ప్రకటించారు. కాగా, తొలి రోజు రెండు ఎకరాలు, తర్వాత 3 ఎకరాలు, అనంతరం 4 ఎకరాలు, ఐదో రోజు 7 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తూ వచ్చింది. ఇక మిగిలిన రైతుల ఖాతాల్లో కూడా ఎకరాల పరిమితితో సంబంధం లేకుండా.. సాగు భూమికి రైతు భరోసా సాయం అందజేస్తామని మంత్రి తుమ్మల ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయం నిధులను గత ఆరు రోజులుగా రైతుల ఖాతాలలో జమ చేస్తున్న విషయం విధితమే..

## డ్రగ్స్ కేసులో నటుడు శ్రీరామ్ అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



కోలీవుడ్ హీరో శ్రీరామ్ మాదకద్రవ్యాల కేసులో అరెస్ట్ కావడం తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర కలకలం రేపింది. ఏఐఏడీఎంకే మాజీ నేత ప్రసాద్ నుంచి శ్రీరామ్ డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ అరెస్ట్ జరిగింది. వివరాల్లోకి వెళితే, చెన్నై నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ పోలీసులు డ్రగ్స్ కేసు విచారణలో భాగంగా నటుడు శ్రీరామ్‌ను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అనంతరం ఆయనను రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ శ్రీరామ్ రక్త నమూనాలను సేకరించినట్లు సమాచారం. ఆ తర్వాత నుంగంబాక్కం పోలీస్ స్టేషన్‌కు తరలించి సుమారు రెండు గంటల పాటు అధికారులు ఆయన్ను విచారించారు.

# రసవత్తరంగా తొలి టెస్టు

- భారత్ రెండో ఇన్నింగ్స్ 364 ఆలౌట్...
- ఇంగ్లాండ్ టార్గెట్ 371 రన్స్
- రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ , పంత్ సెంచరీలు



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ - ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. 371 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. భారత్ విజయం కోసం ఇంకా 10 వికెట్లు పడగొట్టాల్సి ఉంది. మరోవైపు ఇంగ్లండ్ 350 పరుగులు చేయాల్సి ఉంది.

90/2 ఓవర్ నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులకే ఆలౌటైంది. కేఎల్ రాహుల్(247 బంతుల్లో 18 ఫోర్లతో 137), రిషభ్ పంత్(140 బంతుల్లో15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 118) సెంచరీలతో రాణించినా.. మిడిలార్డర్, లోయరార్డర్ వైఫల్యం కొంపముంచింది.31 పరుగుల వ్యవధిలోనే టీమిండియా చివరి 6 వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/80), జోష్ టంగ్(3/72) మూడేసి వికెట్లు తీయగా.. షోయబ్ బషీర్(2/90) రెండు వికెట్లు పడగొట్టాడు. క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ చెరో వికెట్ తీసారు.

నాలుగో రోజు ఆట ఆరంభంలోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్(8) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను రెండు పరుగులు మాత్రమే జోడించి వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో పంత్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతో ఈ జోడీ ఓపికగా ఆడింది. ఈ క్రమంలో రాహుల్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో భారత్ 153/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా ఆడగా.. రాహుల్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. 83 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన పంత్ అనంతరం భారీ సిక్సర్లతు బాదాడు. మరోవైపు బషీర్ బౌలింగ్‌లో క్విక్ డబుల్ తీసి రాహుల్ 202 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు సెంచరీకి చేరువైన పంత్.. మూడెంకల మార్క్ అందుకోవడానికి కాస్త సమయం తీసుకున్నాడు. షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఒంటి కన్ను సెలెబ్రేషన్స్‌తో అందర్నీ ఆశ్చర్య పరిచాడు. అనంతరం జోరూట్ వేసిన మరుసటి ఓవర్‌లో 4, 6, 4 బాదాడు. బషీర్ బౌలింగ్‌లో పంత్ (118) భారీ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 195 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి కరుణ్ నాయర్ రాగా.. రాహుల్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. దాంతో భారత్ 298/4 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది.

మూడో సెషన్ ఆరంభంలోనూ రాహుల్, కరుణ్ నాయర్ జోడీని బ్రైడన్ కార్స్ విడదీసాడు. స్టన్నింగ్ డెలివరీతో రాహుల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఆ వెంటనే కరుణ్ నాయర్.. క్రిస్ వోక్స్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. జోష్ టంగ్ బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ చెత్త షాట్‌తో వికెట్ పారేసుకోగా.. సిరాజ్, బుమ్రా వరుసగా ఔటయ్యారు. జడేజా ఒంటరి పోరాటం చేసే ప్రయత్నం చేయగా.. మరో ఎండ్‌లో అతనికి సహకారం లభించ లేదు. ప్రసిధ్ కృష్ణను ఔట్ చేసిన షోయబ్ బషీర్ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 465 పరుగులు చేయడంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది.



## అమెరికాలో 'కన్నప్ప' ప్రీమియర్లు..

**బలగం టీవీ, హైదరాబాద్**

'కన్నప్ప' చిత్రం యూఎస్ ప్రీమియర్లకు సంబంధించిన కీలక వివరాలను చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించింది. అమెరికాలో 'కన్నప్ప' సినిమా గ్రాండ్ ప్రీమియర్ షోలు జూన్ 26వ తేదీన ప్రదర్శితం కానున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు (ఈఎస్‌టీ) ఈ ప్రీమియర్లు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అమెరికాలో వాసారా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేస్తోంది. "ది లెజెండ్ రైజెస్. ది ఫెయిత్ ఇగ్నైట్స్. విట్‌నెస్ ది ఎపిక్ సాగా ఆఫ్ డివోషన్ అండ్ కరేజ్ (వీరుడు ఉదయిస్తున్నాడు. విశ్వాసం ప్రజ్వరిల్లుతోంది. భక్తి మరియు ధైర్యంతో కూడిన ఈ వీరగాథను వీక్షించండి)" అనే క్యాప్షన్‌తో గ్రాండ్ ప్రీమియర్ షోల వివరాలను మేకర్స్ పంచుకున్నారు. సినిమా విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రీమియర్ షోల కోసం టికెట్ బుకింగ్స్ కూడా ఇప్పటికే ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ప్రేక్షకులు తమ టికెట్లను ముందుగానే బుక్ చేసుకోవాల్సిందిగా సూచించారు. 'కన్నప్ప' టైటిల్ పాత్ర చుట్టూ తిరిగే ఈ కథ, పురాణాల్లోని భక్తితత్పరతను, అసామాన్య ధైర్యాన్ని వెండితెరపై ఆవిష్కరించనుంది. తెలుగు సినీ చరిత్రలో ఇదొక గొప్ప దృశ్యకావ్యంగా నిలిచిపోతుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.






## అమీర్ ఖాన్ చిత్రంపై మహేష్ బాబు ప్రశంసలు

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ నటుడిగానే కాకుండా నిర్మాతగా మారి రూపొందించిన చిత్రం సితారే జమీన్ పర్. 2007 సంవత్సరంలో రిలీజై మంచి విజయం సాధించిన తారే జమీన్ పర్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జెనీలియా దేశ్ ముఖ్ కీలక పాత్రల్లో నటించింది. అయితే ఈ మూవీకి మహేష్ బాబు మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ చేశారు. ప్రశంసల వర్షం కురిపించారు. 'సితారే జమీన్ పర్' ఒక అద్భుతమైన సినిమా అని వర్ణించారు. అమిర్ ఖాన్ గత చిత్రాల మాదిరిగానే ఇది కూడా ఒక క్లాసిక్ చిత్రంగా ఉంది.. ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ కచ్చితంగా చిరునవ్వుతో బయటకు వస్తారు. ఇది మిమ్మల్ని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది, క్లాప్స్ కొట్టేలా చేస్తుంది అంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

తారే జమీన్ పర్ సినిమాను సొంతంగా రిలీజ్ చేశారు అమీర్ ఖాన్ . ఇండియాలో 3500 స్క్రీన్లు, ప్రపంచ వ్యాప్తంగా 4200 స్క్రీన్లలో రిలీజ్ చేశారు. బాలీవుడ్ వర్గాల ట్రేడ్ రిపోర్ట్ ప్రకారం మొదటి మూడు రోజులకు గాను ఈ సినిమా 60 కోట్ల దాకా వసూలు చేసినట్టు తెలుస్తుంది. ఈ మూవీకి ఆదివారం బాగానే కలెక్షన్స్ వచ్చాయి